క్లుప్తంగా

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో .. టమాట 25, పచ్చిమిర్చి 55 , బెండ 35, కాకర 35, దొండ 30, దోస 35, ఆలు 25, చామ 45, కీర 30, బీర 35, వంకాయ 30, గోకర 45, బీన్స్ 70, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 50, క్యాబేజీ 30, క్యారెట్ 55, చిక్కుడు 50, ఉల్లి 30 (1 కేజీ), ములక్కాయలు (2) 10 , క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 30, అల్లం 150, వెల్లుల్లి 150.

నేడు సాయిదత్తగణపతి ఆలయంలో కృష్ణాష్టమి

రాయదుర్గం: కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకొని టెలికామ్‌నగర్‌లోని సాయిదత్త గణపతి ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ నిర్వాహకులు డి రవీందర్‌రెడ్డి, డి నరేందర్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. రాత్రి 7 గంటలకు ఉట్టి కొట్టే కార్యక్రమం ఉంటుందన్నారు.

చెక్కులు అందజేత

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు బుధవారం తన క్యాంపు కార్యాలయంలో 55 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూకట్‌పల్లి నియోజకవర్గంలో దాదాపు 16 వేల మందికి చెక్కులు అందించామని తెలిపారు. భవిష్యత్తులో అత్యున్నత నగరంగా హైదరాబాద్ నిలవబోతోందన్నారు.

ముంపు ప్రాంతాల్లో సరుకుల పంపిణీ



సరుకులు అందజేస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పరికి చెరువు పరిసర ప్రాంతాల్లో ఉన్న ధరణినగర్, ఆల్విన్‌కాలనీ ఫేజ్2 ముంపునకు గురైంది. స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ బియ్యం, సరుకులు, కూరగాయలను బుధవారం పలువురికి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరికి చెరువు నాలా ప్రవాహ ఉధృతి పెరిగి వరద నీరు వెనక్కు రావడంతో రోడ్లపై, ఇళ్లలోకి నీరు చేరిందన్నారు. కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణగౌడ్, కృష్ణారావు, రాజబాబు, రాములు గౌడ్, జూపల్లి జనార్ధన్‌రావు, రమేష్ గౌడ్, సత్యంరావు పాల్గొన్నారు.

ఉత్తమ ప్రిన్సిపాల్‌గా శారద



శారదను సన్మానిస్తున్న మంత్రులు సబితారెడ్డి, మహమూద్‌అలీ

రాయదుర్గం: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర స్థాయి ఉత్తమ కళాశాల ప్రిన్సిపాల్ శారదను రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సత్కరించారు. రవీంద్రభారతిలో ఆమెను మంత్రి మహమూద్‌అలీ, మంత్రి సబితారెడ్డిల చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. దీంతో ఆమెను గురుకులాల డాక్టర్ నవీన్‌నికోలస్, అదనపు కార్యదర్శి హన్మంతునాయక్, ఓఎస్‌డీ రంగారెడ్డి, ఆర్‌సీఓ డాక్టర్ శారదావెంకటేష్, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

నాకు అవకాశం ఇవ్వండి

బీజేపీ టికెట్‌కు అనూష దరఖాస్తు



హఫీజ్‌పేట్ : శేరిలింగంపల్లి సెగ్మెంట్‌కు బీజేపీ అభ్యర్థిగా తనకు అవకాశం ఇవ్వాలని హఫీజ్‌పేట కు చెందిన బోయిని అనూష మహేష్ యాదవ్ బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా అనూష యాదవ్ మాట్లాడుతూ అసెంబ్లీ అభ్యర్థిగా తనకు అవకాశం ఇస్తే ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుంటానన్నారు.

పొంగుతున్న వాగులు, వంకలు

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం, గుమ్మడిదల మండలాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. జిన్నారంలోని రాయిన్‌చెరువు అలుగు పారుతుంది. దీంతో జిన్నారం-జంగంపేట గ్రామాల మధ్య రాకపోకలు ఆగిపోయాయి. గుమ్మడిదల గ్రామంలోని ఎర్రచెరువు నిండి అలుగు పారుతుంది. మంబాపూర్ చెరువు మత్తడి పొంగి పొర్లుతుంది. కొడకంచి, జిన్నారం, సోలక్‌పల్లి, ఊట్ల, వావిలాల, తదితర గ్రామాల్లోని చెరువులు నిండు కుండల్లా మారాయి.

ఆఖరి మజిలీ.. అవస్థలు

- శాంతినగర్ శ్మశానవాటికలో కనీస వసతులు కరువు
- వరద ముంపులో శ్మశానవాటిక
- నిధులు మంజూరైనా ప్రారంభం కాని పనులు



అంత్యక్రియల ఘాట్ వద్ద వరద నీరు

హఫీజ్‌పేట్ : శాంతినగర్ కాలనీ శ్మశానవాటికను వైకుంఠధామంగా అభివృద్ధి చేయడానికి నిధులు మంజూరైనా పనులు ప్రారంభం కాలేదు. చందానగర్ డివిజన్ పరిధిలోని శ్మశానవాటికకు వచ్చే ప్రజలకు కనీస వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలకు శ్మశానవాటికలో వరద నీరు చేరి అంత్యక్రియలకు ఆటంకం కలుగుతోంది. కాలనీలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

సమస్యలు ఇవే..

- శ్మశానవాటిక అభివృద్ధి కోసం కోటి ఇరవై ఏడు లక్షల నిధులు మంజూరుతో పాటు టెండర్ పూర్తైనప్పటికీ పనులు ప్రారంభం కాలేదు
- నాలాకు ఆనుకొని ప్రహరీ కూలిపోయి లోపలకు మురుగునీరు చేరింది.
- ఇక వర్షాలు కురిసినపుడు శ్మశానవాటికలో వరదనీరు చేరి అంత్యక్రియలకు ఆటంకం కలుగుతుంది.
- అక్కడ పనిచేసే కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
- కాగా శ్మశాన వాటికలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలి.
- ప్రహరి పక్కన ఉన్న నాలాను బాక్స్ కల్వర్టుగా నిర్మించాలి.
- అస్థికలు భద్రపరుచుటకు ప్రత్యేక గదిని నిర్మించాలి.
- అక్కడ పని చేసే వారికి గదులను నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.



ప్రహరీ వద్ద మురుగు నీటి ప్రవాహం



శాంతినగర్ శ్మశానవాటిక



ప్రహరీ సగం కూలిన దృశ్యం

చర్యలు తీసుకోవాలి



శాంతినగర్ శ్మశానవాటిక అభివృద్ధికి నిధులు మంజూరైనా ఇప్పటి వరకు పనులు ప్రారంభం కాలేదు. కనీస వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు తగు చర్యలు తీసుకోవాలి.

– పవన్‌కుమార్, శాంతినగర్

మురుగునీటితో ఇబ్బంది



శాంతినగర్ శ్మశానవాటిక ప్రహరీగోడ కూలి వరద, మురుగు నీరు లోపలికి వచ్చి ఘాట్‌ల వద్ద చేరింది. అంత్యక్రియలకు వచ్చే వారు బయటనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. వర్షాకాలం శ్మశానవాటిక పూర్తిగా వరద నీటితో నిండిపోతుంది. అధికారులు స్పందించాలి.

–సలీం, శాంతినగర్

చాకలి ఐలమ్మ స్ఫూర్తితో ఐక్యంగా సాగుదాం

- రజక సంఘం రాష్ట్ర కార్యదర్శి చాకలి వెంకటేష్
- 30 లక్షల మంది ఉన్న రజకులకు ఒక టికెట్ కేటాయించని బీఆర్ఎస్
- ఇస్నాపూర్ జాతీయ రహదారిపై రాస్తారోకో



మాట్లాడుతున్న రజక సంఘం రాష్ట్ర కార్యదర్శి చాకలి వెంకటేష్

పటాన్‌చెరు టౌన్: చాకలి ఐలమ్మ స్ఫూర్తితో ఐక్యంగా ముందుకు సాగుతామని, 30 లక్షల జనాభా ఉన్న రజకులకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక టికెట్ కూడా కేటాయించకపోవడం దారుణం అని రజక సంఘం రాష్ట్ర కార్యదర్శి చాకలి వెంకటేష్ అన్నారు. పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ చౌరస్తా ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం వెంకటేష్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి రజకుల ఐక్యవేదిక సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పటాన్‌చెరు బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా తృటిలో అవకాశం కోల్పోయిన నీలం మధు ముదిరాజ్‌కు సబ్బండ వర్గాల మద్దతు పెరుగుతుందన్నారు. ప్రభుత్వం టికెట్ కేటాయించని పక్షంలో స్వతంత్ర అభ్యర్థిగా గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘం పటాన్‌చెరు మండల అధ్యక్షులు గణేష్, గుమ్మడిదల మండల అధ్యక్షులు వీరేష్, అమీన్‌పూర్ మండల అధ్యక్షులు నాగేష్, రామచంద్రపురం మండల అధ్యక్షులు నరసింహ, జిల్లా ప్రధాన కార్యదర్శి పోచయ్య, లక్ష్మణ్, ఆశయ్య,రవి ,సందీప్ ,గోపాల్,నారాయణ, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

మియాపూర్: మియాపూర్ డివిజన్ పరిధిలోని ఎంఏనగర్ కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ పేర్కొన్నారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని ఎంఏ నగర్ కాలనీవాసులు కాలనీలో సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌ను కలిసి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... రోడ్లు, డ్రైనేజీ తదితర సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని అన్నారు. మంజూరైన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయిస్తామన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు కృష్ణారావు, రాజు, అనిల్, డప్పు రాములు, మధు, వెంకటేష్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ ప్రొఫెసర్ కెఎన్ మూర్తి మృతి



రాయదుర్గం: భారత దేశ మైక్రో ఎకానోమెట్రీషియన్‌గా గుర్తింపు పొందిన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ మాజీ డీన్ ప్రొఫెసర్ కెఎన్‌మూర్తి మృతి చెందారు. అనారోగ్యంతో గచ్చిబౌలిలోని కేర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆయన మంగళవారం రాత్రి మృతి చెందినట్లు హెచ్‌సీయూ అధికారులు తెలిపారు. హెచ్‌సీయూలోని ఎకనామిక్స్ విభాగంలో 1985- 2015 వరకు ప్రొఫెసర్‌గా, డీన్‌గా పనిచేశారు. ఆయన మృతి పట్ల పలువురు ప్రొఫెసర్లు, అధ్యాపకులు, అధికారులు, పరిశోధక విద్యార్థులు సంతాపం తెలిపారు.

హెచ్‌సీయూ పూర్వ విద్యార్థులకు అరుదైన అవకాశం

కేంద్ర సంస్థల డైరెక్టర్లుగా నియామకం



ప్రొ.బివిశర్మ



ప్రొ. అమితాబ్‌పాండే

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీకి చెందిన ఇద్దరు పూర్వ విద్యార్థులు కేంద్ర సంస్థ డైరెక్టర్లుగా నియమితులయ్యారు. ప్రొఫెసర్ బివి శర్మ, ప్రొఫెసర్ అమితాబ్‌పాండే హెచ్‌సీయూలోని ఆంత్రోపాలజీ విభాగం పూర్వ విద్యార్థులు. ఆంత్రోపాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా(ఏఎస్ఐ) హెచ్‌క్యూ డైరెక్టర్లుగా వీరు నియమితులయ్యారు. ప్రొఫెసర్ బివిశర్మ హెచ్‌సీయూలోని ఆంత్రోపాలజీ విభాగంలో 30 ఏళ్లకు పైగా బోధనా విభాగంలో ఉన్నారు. అలాగే ప్రొఫెసర్ అమితాబ్ పాండే భోపాల్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారెస్ట్ మేనేజ్‌మెంట్ (ఐఐఎఫ్ఎం)లో సోషియాలజీ అండ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్‌కు చైర్మన్, ప్రొఫెసర్‌గానూ ఉన్నారు. పాండే ప్రపంచబ్యాంక్, యూఎన్‌డీపీ, యూనిసెఫ్, యూరోపియన్ యూని యన్, ఐసీఎస్ఎస్ఆర్, డీఎస్‌టీ, ఎంఓటీఏలతో కన్సల్టెంట్, ట్రైనర్‌గా జాతీయ, అంతర్జాతీయ బహుళ ప్రాజెక్టులనూ పూర్తి చేశారు.

బోనాలలో అడ్డుకున్నారని దళితుల ఫిర్యాదు

గచ్చిబౌలి: బోనాలలో దళితులను అడ్డుకోవడంతో తోపులాట చోటు చేసుకుంది. దీంతో ఈ పంచాయితీ గచ్చిబౌలి ఠాణాకు చేరింది. వట్టినాగులపల్లిలో రెండు రోజులుగా బొడ్రాయి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. బుధవారం దళితులు బోనాలతో దేవాలయానికి వెళుతుండగా ఇతరులు తమను తిడుతూ దాడి చేశారని దళితులు బక్కని రాము, బ్యాగరి అభిలాష్, సాయి తదితరులు గచ్చిబౌలి పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. కుల వివక్షకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. బోనాల విషయంలో తోపులాట చోటుచేసుకున్న మాట వాస్తవమేనని, పూర్తి వివరాలు సేకరించిన అనంతరం కేసు నమోదు చేస్తామని గచ్చిబౌలి సీఐ జేమ్స్‌బాబు తెలిపారు.

ఉత్తమ ఫలితాలు సాధిద్దాం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించి ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని రాష్ట్ర ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధికారి కృష్ణారావు అన్నారు. బుధవారం భెల్ జ్యోతి విద్యాలయలో జరుగుతున్న ఆరు మండలాల ప్రభుత్వ ఉపాధ్యాయుల శిక్షణ తరగతుల చివరి రోజు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సులభమైన పద్ధతిలో ఎలా విద్యా బోధన చేయాలో ఈ శిక్షణ తరగతులు నేర్పుతాయని అని అన్నారు. విద్యార్థులు ఇష్టపడి చదివేలా తీర్చిదిద్దాలని తెలిపారు. గణిత శాస్త్రం బోధనపై ఉపాధ్యాయుడు శంకర్ బాబు వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓ జెమినీ కుమారి, అధికారులు రాంబాబు, రాములు, ప్రభాకర్, సిద్దిరెడ్డి, శ్రీనివాస్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నేడు షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని వివేకానందనగర్, హైదర్‌నగర్, ఆల్విన్‌కాలనీ, కూకట్‌పల్లి పార్టు డివిజన్ల పరిధిలోని పలువురికి గురువారం ఉదయం 9 గంటలకు ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్‌ల సమక్షంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేయనున్నట్లు కార్యాలయ సిబ్బంది ఓ ప్రకటనలో తెలిపారు.

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

పటాన్‌చెరు టౌన్: శ్రీకృష్ణ జన్మాష్టమి నేపథ్యంలో పటాన్‌చెరు పట్టణంలోని శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో ఉత్సవాల ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆలయ ధర్మకర్త, కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...గురువారం స్వామివారికి ప్రత్యేక పూజలు ,ఉదయం 10:30 గంటలకు కళ్యాణ మహోత్సవం, మధ్యాహ్నం అన్నదానం.. సాయంత్రం 5 గంటలకు ఉట్ల సంబరాలు, కోలాటాలు స్వామివారి ఊరేగింపు ఉంటుందన్నారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారి కల్యాణాన్ని వీక్షించి, అన్నదాన కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

అలుక్ హోమ్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ప్రారంభం

హఫీజ్‌పేట్: అలుక్ హోమ్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ఫాసెట్ ఫాసెడ్ కన్సల్టెన్సీ ప్రతినిధి నితిన్ బాటియా బుధవారం గచ్చిబౌలిలో ప్రారంభించారు. అల్యూమినియం, కిటికీలు, తలుపులు ఇంకా డిజైన్లలోనూ, ఇంజనీరింగ్‌లోనూ, పంపిణీలోనూ గ్లోబల్ లీడర్‌గా అలుక్ ఉందని నిర్వాహకులు తెలిపారు. ఈ వినూత్న వ్యవస్థ ఇండోర్, అవుట్‌డోర్, లివింగ్లో ఏకీకరణను అందిస్తుందన్నారు. ఇది ఇంటి యజమానుల విశ్రాంతి కోసం మంత్రముగ్ధమైన ప్రదేశాలను సృష్టించడానికి వీలు కల్పిస్తుందన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని వినతి



తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న కమిటీ ప్రతినిధులు

శేరిలింగంపల్లి: అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శేరిలింగంపల్లి తహశీల్దార్‌కు తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకపోతే ఈ నెల 11 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మె చేస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 70 వేల మంది అంగన్‌వాడీ ఉద్యోగులు బడుగు, బలహీన వర్గాలకు చెందిన మహిళలేనన్నారు. కనీస వేతనాలు, పెన్షన్, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత లేక అంగన్‌వాడీలు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పర్మినెంట్ చేయడంతో పాటు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ శేరిలింగంపల్లి మండల కార్యదర్శి కొంగరి కృష్ణ, అంగన్‌వాడీ టీచర్లు నాగమణి, సుజాత, కె.జ్యోతి, సరస్వతి, సంధ్యారాణి, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

రెండోరోజూ రాకపోకలు బంద్



లింగంపల్లి అండర్‌బ్రిడ్జి వద్ద బుధవారం పరిస్థితి

శేరిలింగంపల్లి: వర్షం తగ్గిపోయినా రెండవ రోజూ లింగంపల్లి రైల్వే అండర్‌బ్రిడ్జి కింద వరద నీరు పోలేదు. దీంతో బుధవారం కూడా వాహనాల రాకపోకలు ఆగిపోయాయి. చిన్నపాటి వర్షానికే అండర్‌బ్రిడ్జి కింద నీరు చేరడం రాకపోకలకు అంతరాయం ఏర్పడడం ఏటా వర్షాకాలంలో కొనసాగుతోంది. బుధవారం రాత్రికి నీరు తొలగించి గురువారం రాకపోకలను పునరుద్ధరించాలని అధికారులు భావిస్తున్నారు.

సైబర్ వలలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

- రూ.30 లక్షలు పోగొట్టుకున్న వైనం
- టాస్కులు, కమిషన్‌ల పేరిట మోసం

పటాన్‌చెరు టౌన్: పార్ట్ టైం జాబ్ అంటూ ఫోన్‌కు వచ్చిన వాట్సాప్ మెసేజ్‌కు స్పందించి ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రూ.30 లక్షలు పోగొట్టుకున్న సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. డివిజన్ పరిధిలోని సింఫోని కాలనీకి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి ఆగష్టు 17వ తేదీన పార్ట్‌టైం జాబ్ అంటూ తన వాట్సాప్‌కు మెసేజ్ వచ్చింది.దీంతో ఆ ఉద్యోగి తన వివరాలను నమోదు చేశాడు. దీంతో సైట్ నిర్వాహకులు అతనికి ఒక వాలెట్ ఐడి క్రియేట్ చేసి ఇచ్చారు. దీంతో ఉద్యోగి ముందుగా రూ.9 వేలు చెల్లించి ఇచ్చిన టాస్కులు చేయడం మొదలుపెట్టాడు. కాగా తాను పెట్టిన నగదును సైబర్ నేరగాళ్లు తనకిచ్చిన వాలెట్ లో చూపిస్తూ వచ్చారు.ఈ క్రమంలో బాధితుడు పలు దఫాలుగా మొత్తం రూ.30 లక్షలు చెల్లించాడు.సైబర్ నేరగాళ్లు ఉద్యోగితో నగదు పెట్టిస్తూ తనకు ఇచ్చిన వాలెట్‌లో నగదుతో పాటు కమిషన్ నగదు చూపిస్తూ వచ్చారు. దీంతో ఉద్యోగి చివరిగా తాను పెట్టిన నగదు, కమిషన్ ఇవ్వాలని అడగగా స్పందించ లేదు. దీంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం బుధవారం పటాన్‌చెరు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నవ సమాజ నిర్మాతలు గురువులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: ఉపాధ్యాయులు నవ సమాజ నిర్మాతలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. బుధవారం పటాన్‌చెరు పట్టణంలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో గురుపూజోత్సవంను పురస్కరించుకొని ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయ దినోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. గురువు లేని విద్య గుడ్డి విద్య అని, గురువు లేకుండా ఏ విద్యార్థి రాణించలేదని అన్నారు.అనంతరం నియోజకవర్గ పరిధిలోని ప్రైవేటు పాఠశాలల ఉత్తమ ఉపాధ్యాయులను ఎమ్మెల్యే సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, ఆత్మ కమిటీ చైర్మన్ కుమార్‌గౌడ్, సీనియర్ నాయకుడు దశరథ్ రెడ్డి, గూడెం మధుసూదన్‌రెడ్డి, వెంకటేష్ గౌడ్,డీసీసీబీ డైరెక్టర్ రాఘవేంద్ర రెడ్డి, మండల విద్యాధికారి పి పి రాథోడ్, మాజీ కార్పొరేటర్ అంజయ్య, ప్రైవేటు పాఠశాలల సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఫిట్‌నెస్ బాగుండి.. కష్టపడితే క్రీడల్లో రాణించొచ్చు

సైనా నెహ్వాల్



హఫీజ్‌పేట్: ఫిట్‌నెస్ బాగుండి కష్టపడేతత్వం ఉంటే క్రీడల్లో రాణించడం సాధ్యమేనని ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి సైనా నెహ్వాల్ స్పష్టం చేశారు. రాయదుర్గంలోని ఒరియన్ విల్లాస్‌లో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. 'భారత్‌లో చాలా మంది యువ క్రీడాకారిణులు ఉన్నారు. వారికి చక్కటి శిక్షణ అందించి ప్రోత్సహిస్తే చక్కగా రాణించి దేశానికి మంచి పేరు తేస్తారు. అన్ని క్రీడలలో పాల్గొనే క్రీడాకారులకు మినరల్స్‌తో కూడినవి చాలా అవసరం. నేను ఇలాంటి మినరల్స్ ఉన్నవి వాడటం, ఫిట్‌నెస్‌పై చక్కటి అవగాహన కలిగి ఉండటం, కోచ్‌లు, తల్లిదండ్రులు సహకరించడంతోనే 25 ఏళ్లపాటు బ్యాడ్మింటన్‌లో కొనసాగాను' అని చెప్పారు. సైనా మూవీ చాలా బాగుంది. తాను ఆ సినిమా చూశానని సైనా నెహ్వాల్ పేర్కొన్నారు. ఈ మూవీ నేటితరం క్రీడాకారిణులకు ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు.

సీఆర్ ఫౌండేషన్‌లో ఉపాధ్యాయ దినోత్సవం



హఫీజ్‌పేట్ : ఉపాధ్యాయ దినోత్సవాన్ని కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్‌లో వివిధ రంగాలకు చెందిన 23 మంది విశ్రాంత ఉపాధ్యాయులు, మహిళా సంక్షేమ కేంద్రం వృత్తి విద్య కోర్సుల ఉపాధ్యాయులను ఫౌండేషన్ సభ్యులు సన్మానించారు. అనంతరం ధనలక్ష్మి, ప్రొఫెసర్ వేణుగోపాలరావు, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ, చంద్ర రాజేశ్వరరావుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఆర్ ఫౌండేషన్ కార్యదర్శి చెన్నమనేని వెంకటేశ్వరావు, కోశాధికారి చెన్నకేశవరావు, హెల్త్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ రజిని, కృష్ణకుమారి, మల్లంపాటి వెంకటేశ్వరావు, పరుచూరి జమున, అరుణకుమారి, తుకారం, డా. సరస్వతి పాల్గొన్నారు.